దర్జాగా పూడ్చేస్తున్నారు..

- భూముల ధరలు పెరగడంతో వాగులు, కుంటలు కబ్జా
- వాగును పూడ్చేసి అక్రమ నిర్మాణాలు
- దిగువకు చేరని వరదనీరు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మరోపక్కకు మళ్లించిన వాగు



వాగు ప్రవహించే ప్రాంతంలో నిర్మిస్తున్న ఇళ్లు

జగిత్యాలరూరల్: భూముల ధరలు పెరిగడంతో వాగులు, భూములు కబ్జాకు గురవుతున్నాయి. పట్టణ శివారులో ఉన్న వాగులు, చెరువుల భూములను అక్రమార్కులు కబ్జా చేసి ఇళ్ల నిర్మాణం చేపడుతన్నారు. భూముల ధరలకు రెక్కలు రావడంతో చెరువులు, వాగులను పూడ్చివేస్తూ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రెవెన్యూ నక్ష ప్రకారం ఉండాల్సిన వాగులు కొందరు రియల్ ఎస్టేట్ భూ యజమానుల పలుకుబడితో వాగులను పూడ్చుతూ భూములను చదును చేసుకుని ప్లాట్లు పెట్టి విక్రయాలు చేపడుతున్నారు. జగిత్యాల అర్బన్ మండలం మోతె చెరువు మత్తడి నుంచి తిమ్మాపూర్ శివారులోని ముప్పాల చెరువుకు వచ్చే వాగును చాలా మంది భూ యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి తమ ఇష్టారాజ్యంగా వాగును మళ్లిస్తూ ప్లాట్లు పెట్టి విక్రయిస్తూ ఇంటి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు..

తిమ్మాపూర్ శివారులోని మోతె శివారులోని వాగును భూ యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చేయడంతో తమ పంట పొలాలు మునుగుతున్నాయని 15 రోజుల క్రితం రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది. దీంతో చాలా మంది రైతులు వాగులో వచ్చే వరదలతో తమ పొలాలు ముంపునకు గురవుతున్నాయని, గతంలో ఉన్న నక్ష ప్రకారం వాగును పునరుద్ధరించాలని కోరుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

కబ్జా చేశారు



మోతె నుంచి తిమ్మాపూర్ వరకు వెళ్లే వాగును కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ యజమానులు పూడ్చివేసి ఇతర పక్కల నుంచి వాగును మళ్లించారు. దీంతో నీళ్లు ఎటూ వెళ్లక మా భూములు పూర్తిగా మునిగిపోతున్నాయి. అధికారులు సర్వే చేసి నక్ష ప్రకారం వాగును పునరుద్ధరించాలి.

– చుక్క చంద్రయ్య, రైతు, జగిత్యాల

పట్టించుకోవడం లేదు



తిమ్మాపూర్, మోతె గ్రామాల్లో ఉన్న వాగును చాలా మంది పూడ్చి వేసి నీరు వెళ్లకుండా అక్రమించుకుంటున్నారు. దీంతో తమ భూముల నుంచి వరద నీరు వెళ్లడంతో పంటలు పండటం లేదు. చాలా సార్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గంగన్న, రైతు, జగిత్యాల

హద్దులు ఏర్పాటు చేస్తాం



జగిత్యాల అర్బన్ మండలం మోతె నుంచి మొదలైన వాగు తిమ్మాపూర్ శివారులోని ముప్పారపు చెరువు వరకు ఉంది. తిమ్మాపూర్ శివారులో వాగును పూడ్చివేశారని రైతులు ఫిర్యాదు చేశారు. చిన్ననీటి పారుదల శాఖ అధికారులతో సర్వే నిర్వహించి నక్ష ప్రకారం వాగుకు హద్దులు ఏర్పాటు చేస్తాం.

– నవీన్, తహసీల్దార్, జగిత్యాల రూరల్

పంచాయతీ కార్మికుల గోడు ప్రభుత్వానికి పట్టదా?



మల్లాపూర్‌లో సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు

మల్లాపూర్: గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల గోడు ప్రభుత్వానికి పట్టదా అని తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ మండల అధ్యక్షుడు తిప్పనవేని సుధాకర్ అన్నారు. సోమవారం మల్లాపూర్ భరతమాత కూడలి వద్ద గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చాలిచాలనీ వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న కారోబార్లు, పారిశుధ్య కార్మికులు, పార్ట్‌టైం వర్కర్ల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న అన్నికేటగిరిల ఉద్యోగులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి గడచంద శ్రీనివాస్, ముద్దం శ్రవణ్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె నోటీస్

ఇబ్రహీంపట్నం: తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ మంగళవారం నుంచి నిరవదిక సమ్మెను చేస్తున్నట్లు పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, ఎంపీపీ జాజాల భీమేశ్వరి కి సమ్మె నోటీస్ అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు జగన్, ఉపాధ్యక్షుడు అనంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమేశ్, రతన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సమ్మె నోటీస్

కథలాపూర్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించేవరకు సమ్మెలో ఉంటామని మేడిపెల్లి మండల పరిషత్ కార్యాలయంలో అధికారికి కార్మికులు సోమవారం నోటీసులు ఇచ్చారు. పంచాయతీ సిబ్బందికి మల్టీపర్పస్ అనే పేరును తొలగించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న వారందరం మూకుమ్మడిగా సమ్మెలో ఉంటామని పంచాయతీ సిబ్బంది పేర్కొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో అధికారుల తనిఖీ



తుంగూర్‌లో తనిఖీ చేస్తున్న ఏవో అనూష

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంతో పాటు, తుంగూర్, కొల్వాయి, తాళ్ళధర్మారం, మంగేళ గ్రామాల్లోని విత్తన దుకాణాలను సోమవారం వ్యవసాయాధికారి అనూష తనిఖీ చేశారు. దుకాణాల్లో విక్రయిస్తున్న విత్తన నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపినట్లు తెలిపారు.ఆమె వెంట వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి దీపిక సోమవారం తనిఖీ చేశారు. రసాయన ఎరువుల షాంపిళ్లను సేకరించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏవో వెంట ఏఈవో నరేశ్, సింగిల్‌విండో కార్యదర్శి మంత్రి సతీశ్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

సంఘ భవనాలకు ప్రొసీడింగ్‌లు అందజేత



ప్రొసీడింగ్ అందిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి: కుల సంఘ భవనాల ఏర్పాటు కోసం బ్యాలెన్స్ వర్క్ కింద రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా సోమవారం రూ.10 లక్షల విలువ గల ప్రొసీడింగులు అందజేశారు. మండలంలోని తీగలధర్మారం, వెల్గటూర్ మండలంలోని మత్తునూర్ గ్రామాలకు చెందిన నేతకాని మహావీర్ సంఘం ఆధ్వర్యంలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్

పెగడపల్లి: అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో మండల అధికారులు కావాల్సిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండలంలోని బతికపల్లి, దీకొండ, ల్యాగలమర్రి, ఎల్లాపూర్, రాములపల్లి, నంచర్ల, వెంగళాయిపేట, ఆరవెల్లి, సుద్దపల్లి, లింగాపూర్, మద్దులపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కృష్ణచైతన్య సోమవారం సందర్శించారు. విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, మూత్రశాలలు ఇతర వసతులపై ఆరా తీశారు. ఆర్‌ఐ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శోభ

పెగడపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎంపీపీ శోభ, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. మండలంలోని నంచర్లలో సోమవారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉందన్నారు. పెగడపల్లి మండలంలో మంత్రి ఈశ్వర్ కృషితో కోట్లాది నిధులు వెచ్చించి అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బండి వెంకన్న, సురేందర్ రెడ్డి, వేణుగోపాల్, తిరుపతియాదవ్, అంజి, ఆనందం, రాజేశ్వర్‌రావు, మోహన్‌రెడ్డి, సురేశ్, రాములు, వేణు, ద్రోణాచారీ, రాజు, రఘుపతి, సునీల్, నర్సయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్యాల: ఆర్యవైశ్య నిరుపేదలను ఆదుకునేందుకు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బట్టు పవన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆర్థికంగా, విద్యాపరంగా వెనకబడిన ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బట్టు విజయానంద్, శివరాత్రి ప్రసాద్, ముత్యపు శ్రీనివాస్, పోకల నరేశ్,లక్ష్మణ్, శంకర్, కొండగట్టు ఆలయ డైరెక్టర్ పోచమ్మల ప్రవీణ్ పాల్గొన్నారు.

40 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 26న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా, కంటి ఆపరేషన్ల కోసం 40 మందిని సామవారం ప్రత్యేక బస్సులో రేకుర్తికి లయన్స్ క్లబ్ సభ్యులు తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నోముల రంజిత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎలేటి చిన్నారెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మల్లాపూర్‌లో ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మల్లాపూర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆమె ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులను ఉద్యోగులుగా గుర్తించి రూ.21వేల కనీస వేతనాన్ని ఇవ్వాలన్నారు. చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత, కనీస వేతనం వంటి డిమాండ్ల సాధనకు టోకెన్ సమ్మె విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సులోచన, మండల అధ్యక్షురాలు మగ్గిడి సాయమ్మ, సభ్యులు లక్ష్మి, రాజేశ్వరి, రుక్మా తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే, ఎంపీపీ, గ్రామస్తులు

రాయికల్: మండలంలోని తాట్లవాయి గ్రామంలో 156, 26 సర్వే నంబర్లలో దశాబ్ద కాలంగా గిరిజనులు పంటలు సాగుచేస్తున్నారని, వారికి పట్టాలు అందజేయాలని కోరుతూ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సోమవారం ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి ఆధ్వర్యంలో కలిశారు. స్పందించిన ఎమ్మెల్యే కలెక్టరేట్‌లో కలెక్టర్ యాస్మిన్ బాషాను కలిసి సమస్యను విన్నవించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు రాగి సాగరిక, నందునాయక్, నాయకులు చిట్యాల గంగాధర్, సురేశ్‌నాయక్, కిషన్‌నాయక్, బానోవత్ స్వామి, సుగుణ, మల్లేశం, రుక్కవ్వ, ప్రవీణ్ పాల్గొన్నారు.

‘ఫినోబ్యాంక్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి’



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్: ఫినోబ్యాంక్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాయికల్ పట్టణ అధ్యక్షుడు ధర్మపురి మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఫినోబ్యాంక్ ఖాతాలు ఇస్తున్న నిర్వాహకులు ప్రధాని నరేంద్రమోడీపై అసత్య ప్రచారాలతో ఖాతాలు తీస్తున్నారని ఆరోపించారు. నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దళిత మోర్చా అధ్యక్షుడు సంజీవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భూమేశ్, కార్యదర్శి సామల్ల సతీశ్, కోశాధికారి తోకల శేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి

ధర్మపురి: ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై దత్తాత్రి అన్నారు. దొంగతనాలు అరికట్టడంలో భాగంగా ధర్మపురితో పాటు పరిసర గ్రామాల్లో ఇటీవల చిన్నపాటి దొంగతనాలు జరిగాయి. యజమానులు ఊరికి వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వలేదని, అందుకే సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారమిస్తే పోలీసులతో గస్తీ ఏర్పాటు చేస్తామని, ప్రజలు సహకరించాలని తెలిపారు.

తాండ్ర్యాల- తుర్తి రోడ్డుకు హద్దులు నిర్ణయించాలి

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల నుంచి తుర్తి వరకు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల హద్దులు నిర్ణయించాలని రెండు గ్రామాల ప్రజలు తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. సుమారు 3 కిలోమీటర్ల రోడ్డు వెడల్పుగా ఉండేదని, ఇటివలే పలువురు వెడల్పు తక్కువగా చేయడంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందన్నారు. సర్వేయర్‌తో కొలతలు వేయించి హద్దులు నిర్ణయించాలని తహసీల్దార్‌కు విన్నవించారు.

ప్రజావాణికి ఒక్కటే దరఖాస్తు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మండలంలోని ఎర్దండి గ్రామానికి చెందిన బంక రవళి రేషన్ కార్డులో తమ పేరు తొలగించాలని దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ రవికిరణ్ కుమార్ తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో ప్రభు, ఏపీఎం శంకర్, ఏవో దీపిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ, భగీరథ ఏఈ మల్లేశం, వైద్య సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులపై పోలీసులకు ఫిర్యాదు

జగిత్యాలక్రైం: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యక్తిగత జీవితంపై అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని జగిత్యాల పట్టణ ఏఎస్సై వేణురావుకు సోమవారం జనసేన జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బెక్కం జనార్దన్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్, శ్రీకర్, ప్రభాకర్, రమేశ్ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది యూనియన్ ఎన్నిక

ఇబ్రహీంపట్నం: గ్రామపంచాయతీ సిబ్బంది యూనియన్ మండల అధ్యక్షుడిగా మండలంలోని ఎర్దండి గ్రామానికి చెందిన మర్రిగడ్డ జగన్‌ను సామవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అనంతకుమార్, ప్రధాన కార్యదర్శులుగా జిల్లాపెల్లి రమేశ్,కుంబాల లక్ష్మీనారాయణ, కోశాధికారిగా నిరేటి రతన్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఆర్థికసాయం

కథలాపూర్: బీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన వంగ మమత అనే మహిళ ఇటివలే అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి సోమవారం స్థానిక మున్నూరుకాపు యూత్ సభ్యులు రూ. 5 వేలు ఆర్థికసాయం అందించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉండటంతో తమ సంఘం తరుపున రూ. 5 వేలు ఆర్థికసాయం అందించామని యూత్‌సభ్యులు పేర్కొన్నారు.

సోమేశ్వర ఆలయ అభివృద్ధికి విరాళం

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపై గల శ్రీ కనక సోమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్–లక్ష్మీ దంపతులు సోమవారం రూ.18 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వైస్ ఎంపీపీ దంపతులకు స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ ముద్దం శరత్‌గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిగా రొట్టె శ్రీధర్

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో బీజేపీ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు అన్నవేని వేణు తెలిపారు. అధ్యక్షుడిగా రొట్టె శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా లోకినిస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా కుంట సత్యం, కార్యదర్శులుగా మామిడి తిరుపతి, నాయిని నరేశ్, యువమోర్చా అధ్యక్షుడిగా లోకిని అర్జున్, ప్రధాన కార్యదర్శిగా కుంట జీవన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, కోశాధికారిగా కొక్కెర రాజు, కార్యదర్శులుగా ప్రశాంత్, రంజిత్ ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



సంఘీభావం తెలుపున్న బీజేపీ నాయకులు

రాయికల్: గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు పడాల తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామపంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మెకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, వేతనం రూ.19 వేలు చెల్లించాలని, కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. లేనియెడల బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, నాయకులు బత్తుల రాజేందర్, రామస్వామి, లక్ష్మణ్, ప్రశాంత్, జలేందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదాల నివారణపై మండలంలోని మేడిపెల్లిలో మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గ్రామస్తులకు సోమవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు గాయపడిన వారికి తక్షణం అందించే ప్రథమ చికిత్సపై వివరించారు. రోడ్డుపక్కన ఉండే డాబాలు, హోటళ్లు, పంచర్‌షాపు యజమానులు, కిరాణషాపులు, ఆర్‌ఎంపీ డాక్టర్లతో మాట్లాడారు. ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై ఉమాసాగర్, హెడ్ కానిస్టేబుల్, తదితరులు పాల్గొన్నారు.

11 వార్డులో గడప గడపకు సంజయన్న



కూలీలతో మాట్లాడుతున్న సంజయ్

కోరుట్ల: పట్టణంలోని 11వ వార్డులో సోమవారం గడప గడపకూ సంజయన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ వార్డులో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. వార్డులో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అక్కడ పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి పలకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఎంపీపీ, సొసైటీ చైర్మన్ పరామర్శ

కొండగట్టు: ఎమ్మెల్సీ రమణను కొడిమ్యాల ఎంపీపీ మేనేని స్వర్ణలత కొడిమ్యాల మండల పీఏసీఎస్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు సోమవారం జగిత్యాలలో పరామర్శించారు. రమణ తండ్రి ఇటీవల మరణించగా వారి స్వగృహంకు వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ కవితను కలిశారు.

బాధిత కుటుంబానికి పెద్దపల్లి ఎమ్మెల్యే పరామర్శ



నివాళి అర్పిస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కోరుట్ల: పట్టణానికి చెందిన టీచర్స్ యూనియన్ మాజీ నాయకుడు బ్రహ్మన్న గారి బ్రహ్మయ్య ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంభాన్ని సోమవారం పెద్దపెల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ పరామర్శించారు.ఈ సందర్భంగా బ్రహ్మయ్యతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

లూయిస్ డాగురేకు నివాళి



నివాళి అర్పిస్తున ఫొటో గ్రాఫర్లు

ధర్మపురి: కెమెరా సృష్టికర్త లూయిస్ జాక్వెస్ మాండే డాగురే వర్ధంతి సందర్భంగా ధర్మపురి పట్టణంలో సోమవారం ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ డాగురే సృష్టించిన కెమెరా ప్రపంచ దేశాలకు జీవనాధారమైందన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు కొత్తపెల్లి కిషన్, ప్రధాన కార్యదర్శి వడ్లూరి రవీందర్, ఉపాధ్యక్షుడు గందం ధర్మయ్య, గౌరవ అధ్యక్షుడు ఉయ్యాల శ్రీనివాస్, కోశాధికారి భూపతి మల్లేశం, జిల్లా నాయకులు వంగల రవీందర్ పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కోరుట్ల రూరల్: పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న మొదటి సంవత్సరం సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి రెగ్యులర్‌గా పాసైన విద్యార్థులు జులై 11వ తేదీ నుంచి 13 వరకు ఉదయం పది నుంచి సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపిక జాబితా 14 వ తేదీన ప్రకటిస్తామని పేర్కొన్నారు. సమాచారం కోసం సెల్ 7995010590 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.